నేడు వీఎంసీ కౌన్సిల్

- 175 అంశాలతో కౌన్సిల్ అజెండా
- 24 ప్రశ్నలపై జరగనున్న కౌన్సిల్
- పలు పనులకు ప్రతిపాదనలు సిద్ధం



వీఎంసీ కౌన్సిల్ హాల్ (ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ శుక్రవారం జరుగనుంది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారుల నుంచి మొత్తం 175 అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుంది.

ప్రధానాంశాలు..

- జక్కంపూడి హౌసింగ్ కాలనీలో ప్రతి నిత్యం పారిశుద్ధ్య నిర్వహణకు 41 మంది కార్మికులు యశ్వంత్ ఫెసిలిటీ సర్వీసెస్ ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. వీరి కాంట్రాక్ట్ ఈ ఏడాది ఆగస్టుతో ముగిసినందున కాంట్రాక్ట్‌ను మరో ఏడాది పాటు పొడిగించటం, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనంగా ఏడాదికి రూ.1.03 కోట్లు వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి చెల్లించేలా కౌన్సిల్‌కు ప్రతిపాదన వచ్చింది. దీనిపై సభ్యులు నిర్ణయం తీసుకోనున్నారు.
- సర్కిల్ – 3 పరిధిలోని 9వ డివిజన్‌లో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వీస్ రోడ్డుకు అనుగుణంగా ఉన్న డ్రెయిన్‌ను నిర్మించేందుకు రూ.65.95 లక్షలు, 8వ డివిజన్‌లో 5, 13 బస్ రూట్‌లో ఉన్న డ్రెయిన్‌ను పునరుద్ధరించేందుకు అవసరమైన రూ.93.08 లక్షలు వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి ఖర్చు చేయాలి. ఈ ప్రతిపాదనపై సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.
- విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆధునీకరించేందుకు, అందులో అవసరమైన ఆధునీకర పరికరాలను అమర్చేందుకు అవసరమైన రూ.2 కోట్లను వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి విడుదల చేయాలి. ఈ ప్రతిపాదనపై సభ్యులు చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రశ్నోత్తరాలు..

- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల, అంచనాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, పూర్తయిన పనులపై సభ్యులు ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నించనున్నారు.
- వీఎంసీలో ఉన్న సర్దుబాటు శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వారి విద్యార్హత తదితర వివరాలతో పాటు ఎంతమంది శానిటరీ మేస్త్రీలు ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు ? హెల్త్ అసిస్టెంట్ అర్హత కలిగిన వారికి పదోన్నతి కల్పించారా అనే అంశంపై సభ్యులు ప్రశ్నించనున్నారు.
- వీఎంసీలోని రెవెన్యూ, ఎస్టేట్స్, పట్టణ ప్రణాళిక విభాగం, ప్రజారోగ్య విభాగంపై కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులు, వాటి పూర్తి వివరాలపై చర్చ జరుగనుంది.
- ఇటీవల వచ్చిన బుడమేరు వరదపై చర్చ జరుగనుంది. వీఎంసీ ఎందుకు నగర ప్రజలను అప్రమత్తం చేయలేదు, బుడమేరు వరద నష్టం ఎంత, బాధితులకు అందించిన పరిహారం, రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులను ఆదుకున్న సహాయంపై సభ్యులు ప్రశ్నించనున్నారు.

క్లుప్తంగా

మద్యం సేవించి వాహనాలు నడిపిన 23 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 23 మందికి రైల్వే కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు గురువారం జరిమానా విధించారు. విజయవాడ నగరంలో 4వ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి మోటారు వాహనాలు నడుపుతున్న 23 మంది పట్టుబడ్డారు. అనంతరం పోలీసులు వీరిని కోర్టులో న్యాయమూర్తి వద్ద హాజరుపర్చారు. వీరిలో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, 20 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

నేటి నుంచి ఘంటసాల జయంతి ఉత్సవాలు

విజయవాడకల్చరల్: ఆల్ ఇండియా ఘంటసాల చైతన్యవేదిక ఆదిలీలా ఫౌండేషన్, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఘంటసాల జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఘంటసాల సినీ సంగీత విభావరి, ఘంటసాల అభిమానులతో సదస్సులు నిర్వహిస్తునట్లు వివరించారు. 29న హనుమంతరాయ గ్రంథాలయం, 30న గుంటూరు జిల్లాలోని తుళ్ళూరు, డిసెంబర్ ఒకటోతేదీన విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరుల్లో సదస్సులు నిర్వహిస్తునట్లు తెలిపారు. జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కార్యదర్శి చింతకాయల చిట్టిబాబు తెలిపారు.

మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి గురువారం విశేషంగా అభిషేకాలు, అర్చనలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చనను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పూజలో పాల్గొన్నారు. సాయంత్రం మల్లేశ్వరుడికి పంచహారతుల సేవ నిర్వహించిన తర్వాత ఆకాశదీపం, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ జరిగాయి. శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల ఉత్సవమూర్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి గురువారం పంచామృత అభిషేకాలు జరిగాయి. అనంతరం విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం విజయవాడకు చెందిన శ్రీకైవల్యకృతి సంగీత నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నృత్యాలయానికి చెందిన గురువు శ్రీపొర్దు నేతృత్వంలో 19మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు. చిన్నారులకు ఆలయ ఈవో రామరావు, డీఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

వేధింపుల నివారణపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభావతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆడపిల్లలు, మహిళలు అనేక రూపాలలో హింసకు గురవుతుంటారని, ఆ హింసను సమర్థవంతంగా ఎదుర్కొనేలా కనీస అవగహన కలిగి ఉండాలని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ కోడె ప్రభావతి, డాక్టర్ ఎండీ రుహిన్నీసా బేగం పిలుపునిచ్చారు. కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం ఆడపిల్లలు, మహిళలపై హింసకు వ్యతిరేకంగా అవగహన సదస్సు నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపు మేరకు నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యనిపుణులు మాట్లాడుతూ

ముఖ్యంగా ఆడపిల్లలు తల్లి గర్భం నుంచే వివక్షకు గురవుతున్నారన్నారు. ఆడపిల్ల అని తెలిస్తే చాలు గర్భస్రావం చేయిస్తున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయన్నారు. పాఠశాలకు వచ్చే క్రమంలో, పనిప్రదేశంలో వివిధ రూపాల్లో విద్యార్థులు, మహిళలు వేధింపులకు గురవుతున్నారన్నారు యువతులు, మహిళలు తమను తాము ఏ విధంగా రక్షించుకోవాలనే తెలుసుకోవడంతోపాటు మహిళా చట్టాలపై అవగహన కలిగి ఉండాలని వివరించారు. ఎవరిని నమ్మి ఒంటరిగా వెళ్లకూడదని, ఇతరుల సహకారం తీసుకోవాలన్నారు. అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమానికి స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు అధ్యక్షత వహించగా, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం



ప్రత్యేకాలంకరణలో నందీశ్వరుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో త్రయోదశిని పురస్కరించుకొని నందీశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న కార్తీక నక్షత్రదీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులోభాగంగా అమ్మవారు శ్రీమహిషాసురమర్దినీదేవిగా భక్తులకు దర్శనమిచారు. అమ్మవారికి ఖడ్గమాల, త్రిశతి, కుంకుమార్చన చేశారు. మల్లేశ్వరునికి పంచ హరతులు, వేదస్విస్తి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం త్రయోదశిని పురస్కరించుకొని ప్రదోష కాలంలో నందీశ్వరునికి అభిషేకాలు చేయగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కార్యనిర్వాణాధికారి నటరాజన్ షణ్ముగం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గుండెపోటుతో ఐసీటీసీ కౌన్సిలర్ మృతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విధి నిర్వహణలో ఉన్న కొత్తపేట ఐసీటీసీ కౌన్సిలర్ రామ కోటేశ్వరరావు(48) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. కొత్తపేట ఐసీటీసీ కౌన్సిలర్‌గా విధులు నిర్వహిస్తున్న రామ కోటేశ్వరరావు గురువారం యధావిధిగా విధులకు హాజరయ్యారు. ఈక్రమంలో గుండెపోటు రావటంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో ఆరోగ్యకేంద్రం వైద్యులు హుటాహుటిన సీపీఆర్, ప్రథమ చికిత్స నిర్వహించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవటంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడి మెరుగైన వైద్యచికిత్స అందించాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రిలో పరిస్థితి విషమించటంతో రామకోటేశ్వరరావు మృతి చెందారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం ఫిరంగిపురం తీసుకు వెళ్లారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వత్తిడే కారణం

రామకోటేశ్వరరావు మృతికి విధి నిర్వహణలో వత్తిడి పెరగటం, ఎఫ్ఆర్ఎస్ కారణమంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. 20 ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న రామకోటేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైద్య సిబ్బంది కోరుతున్నారు. విధి నిర్వహణలో మృతి చెందినప్పటికీ నాకో లేదా ఏపీశాక్స్ నుంచి కనీస పరిహారం కూడా ఇవ్వటం లేదని ఆరోపిస్తున్నారు.

రోడ్డుపైనే ఇసుక, ఇటుక విక్రయాలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



పగోడ పార్క్ పక్కన మెయిన్‌రోడ్డుపై విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన ఇసుక



పార్క్ పక్కన మార్జిన్‌లో ఉంచిన ఇటుకలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఖాళీస్థలాలు లీజుకు తీసుకుని చేయాల్సిన భవన నిర్మాణ మెటీరియల్ వ్యాపారాన్ని కొందరు రోడ్డుపైనే చేస్తున్నారు. దీంతో ఆయా రోడ్లలో ప్రయాణించే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులుపడుతున్నారు. ఎవరైనా నిర్మాణపు పనులకోసం ఇంటి ముందు ఉండే రోడ్డులో కొద్దిగా ఇసుక తోలుకుంటేనే ఇబ్బందులకు గురిచేసే టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఏకంగా రోడ్డుపైనే వ్యాపారం చేస్తున్నవారిని మాత్రం పట్టించుకోవడం లేదు. భవానిపురం పోలీసుస్టేషన్ రోడ్డులో యథేచ్ఛగా సాగుతున్న ఈ భవన నిర్మాణ మెటీరియల్ వ్యాపారాల కారణంగా స్థానికులతోపాటు అక్కడే ఉన్న పార్క్‌కు వచ్చే సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

రోడ్డుపైనే ఇసుక, ఇటుక డంప్..

భవానిపురం పోలీసుస్టేషన్ రోడ్డులోని పగోడపార్క్ వద్ద భవన నిర్మాణ మెటీరియల్‌ను రోడ్డుపైనే విక్రయిస్తున్నారు. భవన నిర్మాణ పనులకు అవసరమయ్యే ఇసుక, ఇటుక, కంకర వంటివి అక్కడ రోడ్డుపై డంప్ చేశారు. అక్కడ నుంచి ఇళ్ల మరమ్మతులు, ఇతర పనులకు మెటీరియల్ విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఇసుక, ఇటుకతో వచ్చే వాహనాలు రోడ్డుపై పెట్టి అన్‌లోడ్ చేస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లో డంప్ చేసిన ఇసుక రోడ్డుపైకి వచ్చి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ద్విచక్రవాహనాలు ఈ ప్రాంతానికి చేరుకోగానే స్కిడ్ అవుతుండంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పలువురికి తీవ్రగాయాలు..

ఈరోడ్డుకు అనుకుని పగోడ పార్క్ ఉంది. ఉదయం, సాయంత్రం పిల్లలు ఆటలాడుకునేందుకు ఆ రోడ్డులోనే సైకిల్స్, బైక్‌లపై వస్తుంటారు. పెద్దలు వాకింగ్ చేసేందుకు పార్క్‌కు వస్తున్నారు. డంప్ చేసిన ఇసుక గాలికి ఇసుక రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. దీంతో బైక్‌లు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల ఇద్దరు పాఠశాల విద్యార్థులు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుపై ఇసుక, ఇటుక అమ్మకాలపై టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై భవన నిర్మాణ మెటీరియల్‌ను డంప్ చేసి విక్రయాలు సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు సాధికారత దిశగా అడుగులు వేయాలని ప్రముఖ సైకాలజిస్ట్ పడాల రమాదేవి సూచించారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఐసీసీ విభాగ ఆధ్వర్యంలో గురువారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల రమాదేవి మాట్లాడుతూ మహిళలు ఓర్పు, కృషి, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. తమ కుటుంబంతోపాటు దేశాన్ని అభివృద్ధి చేయగల సత్తా మహిళలకు ఉందన్నారు. మహిళలకు ఉద్యోగ, సామాజిక, ఆర్థిక భద్రత ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఆయా రంగాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఐసీసీ విభాగ కన్వీనర్ డాక్టర్ ఏ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

షాపు ముందు అరుగు ధ్వంసం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నాడని అధికార పార్టీ నేతలు ఓ చిరువ్యాపారిపై కక్ష కట్టారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టౌన్‌ప్లానింగ్ అధికారుల ద్వారా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 25వ డివిజన్ అరండల్‌పేటలో అబ్దుల్ నజీర్ సెల్‌ఫోన్ మెటీరియల్ షాపు నిర్వహిస్తున్నాడు. అతను సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని అధికారపార్టీ నాయకులు అతని షాపు ముందు కాలువపై నాపరాయితో వేసిన అరుగును టౌన్‌ప్లానింగ్ అధికారుల ద్వారా ధ్వంసం చేయించారు. షాపులోకి వెళ్లకుండా ఉండేలా చేశారు. ఆ షాపుకు ఇరువైపులా దుకాణాలు ఉన్నా వాటి జోలికి వెళ్లకుండా కేవలం నజీర్ సెల్‌షాపు ముందు మాత్రమే నాపరాయి అరుగును ధ్వంస చేసి కక్షసాధింపులకు పాల్పడ్డారు. ఈ విషయంపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బంకా భాస్కర్ టౌన్‌ప్లానింగ్ అధికారులను ప్రశ్నించడంతో వారు అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

కరాటే జాతీయ పోటీలకు విజయవాడ క్రీడాకారులు



క్రీడాకారులను సన్మానిస్తున్న అకాడమీ నిర్వాహకులు

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో విజయవాడ క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. వీరిని జేకే గుజుర్యో అకాడమీ నిర్వాహకులు జె.శ్రీనివాసులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 24, 25 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో స్థానిక క్రీడాకారులు టి.తేజశ్రీసాయి, డి.ముఖేష్‌రెడ్డి, కె.వసుధ, షేక్ అఫ్రిన్‌షహనాజ్, ఎస్.జెనిత్, టి.హర్షిత, ఆర్.పి.శౌర్య సత్తా చాటి పతకాలు సాధించడంతో పాటు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు గత కొన్నేళ్లుగా జేకే గుజుర్యో అకాడమీలో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కరాటే సీనియర్ క్రీడాకారులు మహేష్, సాయికుమార్, మధుసూదన రావు, దినేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆకుల శ్రీనివాస్‌ను పరామర్శించిన ముద్రగడ



డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్‌కు నివాళులర్పిస్తున్న ముద్రగడ, చిత్రంలో ఆకుల శ్రీనివాస్ కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పుత్ర వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్‌ను కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. భవానీపురంలోని ఆకుల శ్రీనివాస్ స్వగృహానికి గురువారం విచ్చేసిన ముద్రగడ ఇటీవల ఆకస్మిక మృతి చెందిన డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సేవాభావం కలిగిన డాక్టర్ రాజ్‌కుమార్ చిన్న వయసులోనే అకాల మరణం పొందడ బాధాకరమని ముద్రగడ పేర్కొన్నారు. ఆకుల కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఆకులను పరామర్శించినవారిలో ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు బేతు రామమోహన్‌రావు, అల్లం పూర్ణ, విశ్వనాధ రవి, తోట సాంబశివరావు, పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ, అబ్దుల్ ఖాదర్, దుక్కా వేణు, దూబ తిరుపతి నాయుడు, మేళం చిన్నా, పొదిలి చంటిబాబు తదితరులు ఉన్నారు.



పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ప్రారంభం

ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్–2024 విజయవాడలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గురువారం ప్రారంభమైంది. కబడ్డీ, వాలీబాల్, టగ్‌ఫ్ వార్, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్(డిస్కస్ త్రో, షార్ట్ పుట్, రన్నింగ్, రిలే) క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మానవతావాది జ్యోతిరావు పూలే



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు, రాయన భాగ్యలక్ష్మి, శైలజారెడ్డి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమసమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని పూలే విగ్రహానికి నగరమేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డితో కలిసి గురువారం ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. విష్ణు మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు పేదలఅభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డాయని పేర్కొన్నారు. నగర మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళలు అభివృద్ధి చెందాలంటే చదువే ముఖ్యమని భావించిన పూలే, తనభార్య సావిత్రి పూలేకు చదువు నేర్పించి పాఠశాలలను కూడా స్థాపింపచేశారని వివరించారు. వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుకునేలా కృషిచేసిన పూలే సామాజిక ఉద్యమకారుడని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి ఏసు, కురిటి శివ, పేరం త్రివేణీరెడ్డి, శ్యామ్, ఆర్ఎస్ నాయుడు, వెన్న శివశంకర్, గంగాధర్, పొట్లూరి శ్రీను, నూనె సోమశేఖర్, తవ్వ మారుతి, ఎం హనుమాన్, ఎస్ సంజీవరావు, నరేష్, బీ శ్రీనివాస్, పిళ్లా రవి, షాహినా, రాము గుప్తా, తమ్మిన రఘు, జెల్లి రమేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల నివాళి..

ఏపీ పీటీడీ బీసీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌పీ శేషగిరిరావు ఆధ్వర్యంలో భవానీపురంలోని కార్యాలయంలో పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఈతాకుల కృష్ణ, జెట్టి రామారావు, దాసరి బుజ్జి, మాదాల తిరుపతిరావుయాదవ్, కె.ఆంజనేయులు, పీ జనకిరామ్, ఏపీఎస్ ప్రసాద్, ఎం మోజెస్, టీ పూర్ణయ్య, రవి, టీ ప్రమీల, యశోద, అమృత పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ భవన్‌లో

బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జి.ఉమాదేవి ఆధ్వర్యంలో గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ మాట్లాడుతూ పూలే ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతన బీసీ భవనాలను నిర్మించాలని కోరారు.

నైజాంగేటు సెంటర్‌లో...

వించిపేట(విజయవాడపశ్చిమ): అణగారిన వర్గాల అభ్యున్నతి పాటుపడిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు కొనియాడారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు షేక్ బాజీ ఆధ్వర్యంలో 55వ డివిజన్‌లోని నైజాంగేటుసెంటర్‌లో పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొలగాని శ్రీనివాసరావు, బత్తుల పాండు, పైడాల శ్రీనివాసరావు, సల్మా తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పోతిన మహేష్, నాయకులు



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పూర్ణచంద్రరావు



నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగులు

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని మూడో ట్రాఫిక్ సీఐ కిషోర్‌బాబు హెచ్చరించారు. 34వ డివిజన్ కేదారేశ్వరపేటలో డిప్యూటీ సిటీ ప్లానర్ వై.చంద్రబోస్‌తో కలిసి గురువారం ఆయన పర్యటించారు. సీకె రెడ్డి రొడ్డు, పండ్లమార్కెట్, కేదారేశ్వరపేట రైతుబజార్, సెంట్రల్ వేర్‌హౌస్, ఎర్రకట్ట ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, తోపుడు బండ్లను తొలగించారు. బిల్డింగ్ ఇన్స్పెక్టర్ గిరి, ప్లానింగ్ సెక్షన్ ఇన్స్పెక్టర్ శంకర్, ఆదినారాయణ పాల్గొన్నారు.